
డీఎస్సీ ఫలితాల్లో 1,653 మంది అర్హత



సంగారెడ్డి మున్సిపాలిటీ, పుల్కల్, జోగిపేట టౌన్, మనూరు, సిర్గాపూర్, కల్హేర్, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. జిల్లాలో మొత్తం 3,352 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. వీరిలో 1,653 మంది అర్హత సాధించారు. మొత్తం 551 పోస్టులు ఉన్నాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్-92, భాషా పండితులు-24, పీఈటీ-6, ఎస్జీటీ- 226, ఎస్ఏ ప్రత్యేక ఎడ్యుకేషన్-9, ఎస్జీటీ ప్రత్యేక ఎడ్యుకేషన్-35 పోస్టులను గుర్తించారు. అర్హత సాధించిన 1,653 మందికి ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు శాంతినగర్ సెయింట్ ఆంథోనీ పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. అభ్యర్థులు అని రకాల ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సత్తాచాటారు: డీఎస్సీ ఫలితాల్లో చౌటకూరుకు చెందిన గాండ్ల రాజు పీఈటీ విభాగంలో 65 మార్కులు సాధించి జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. మనూరు మండలం బోరంచకు చెందిన వెంకట్ రెడ్డి స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో, సిర్గాపూర్ మండలం బొక్కస్ గావ్‌కు చెందిన యోగేశ్వర్ స్కూల్ అసిస్టెంట్ సాంఘికశాస్త్రంలో, కల్హేర్ మండలం రాపర్తికి చెందిన మశ్చేందర్ స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రంలో జిల్లా మొదటి ర్యాంకులు సాధించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు


విద్యార్థినుల ప్రదర్శన

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు సంగారెడ్డిలోని సైన్స్ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యం, పరిశుభ్రత అంశంపై అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రథమ బహుమతి దక్కింది. వీరికి జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి బహుమతి అందించారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

సైబర్ మోసాల సొమ్ము రికవరీలో..
రాష్ట్రంలో జిల్లాకు మూడో స్థానం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో సైబర్ మోసాల సొమ్ము రికవరీలో రాష్ట్రంలోనే జిల్లాకు మూడో స్థానం దక్కిందని ఎస్పీ చెన్నూరి రూపేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 140 సైబర్ నేరాలు, ఇ-పెట్టి 911 కేసులు రాజీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బాధితులకు రూ.1.91 కోట్లను అందజేసినట్లు వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: అక్టోబరు 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో పోలీస్ చట్టం-30 అమలు చేయనున్నట్లు ఎస్పీ రూపేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతులు లేకుండా ర్యాలీలు, దీక్షలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులకు జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలని కోరారు.

చుక్క నిల్వక చిక్కు

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, పుల్కల్

గండ్లు పడిన జల వనరులకు తక్షణ మరమ్మతులు అవశ్యం

నిధులకు ప్రతిపాదనలు ఇలా..
- దెబ్బతిన్న నీటి వనరులు: 23
- తాత్కాలిక మరమ్మతులకు నిధుల అంచనా: రూ.36.40 లక్షలు
- శాశ్వత మరమ్మతులకు..: రూ.6.48 కోట్లు

జిల్లాలో ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించాయి. నీటి వనరులు మత్తడి దూకాయి. వరద తాకిడికి కొన్ని చోట్ల బలహీనంగా ఉన్న కట్టలు తెగాయి. నీరంతా వృథాగా బయటికి వెళ్లింది. నీటి పారుదల శాఖ అధికారులు గండ్ల పూడ్చివేతపై దృష్టి సారిస్తేనే.. ఇక మీదట కురిసే వర్షపునీరు నిలిచే అవకాశం ఉంటుందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.

యాసంగి సాగు లేనట్టేనా?

ఈ ఏడాది వానాకాలం ఆరంభంలో వర్షాలు మురిపించాయి. రైతులు ఉత్సాహంగా పంటల సాగుపై ఆసక్తి చూపారు. ఆ తర్వాత జూన్, జులై నెలల్లో వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో బోరుబావుల కింద సాగు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ.. చెరువులు, కుంటల కింద పంటలు అరకొరగా వేశారు. ఆగస్టు చివరి వారంలో కురిసిన వర్షాలతో చెరువులు జలకళ సంతరించుకున్నాయి. అప్పటికే అదను దాటిపోవడంతో చాలా చోట్ల పొలాలను బీళ్లుగానే ఉంచారు. యాసంగిలోనైనా పంటలు వేసుకోవచ్చని ఆశించారు. సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లాయి. చాలా చోట్ల గండ్లు పడి నీరంతా వృథాగా బయటకు ప్రవహించింది.

క్షేత్రస్థాయి పరిస్థితి

- రాయికోడ్ మండలం ఎల్లంపల్లి చెరువుకు ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడింది. దానికింద 200 ఎకరాల ఆయకట్టు ఉంది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు. ఈ చెరువుకు తాత్కాలిక మరమ్మతులకు రూ.9 వేలు, శాశ్వత మరమ్మతులకు రూ.24లక్షలు అవసరమని నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు.


ముదిమాణిక్యంలో నాగుల్ చెరువుకు గండి(పాత చిత్రం)

- మొగుడంపల్లి మండలం గోపన్‌పల్లి చెరువు కట్ట కోతకు గురయింది. ఈ జల వనరు కింద 175 ఎకరాల ఆయకట్టు ఉంది. తాత్కాలిక మరమ్మతులకు రూ.64వేలు, శాశ్వత మరమ్మతులకు రూ.24లక్షల చొప్పున నిధులు అవసరమని అధికారులు అంచనాలు రూపొందించారు.
- కల్హేర్ మండలం బీబీపేటలోని రామేశ్వరం చెరువు శాశ్వత మరమ్మతులకు రూ.24 లక్షలు, ఇదే మండలం మన్‌సాన్‌పల్లిలోని దేవునిపల్లి చెరువు మత్తడి మరమ్మతులకు రూ.24 లక్షలు అవసరమని అధికారులు నివేదికలు పంపించారు.
- పుల్కల్ మండలం ముదిమాణిక్యంలోని నాగుల్ చెరువుకు గండి పడినప్పటికీ ఇప్పటికీ మరమ్మతులు చేపట్టలేదు. ఈ చెరువుల కింద ఆయకట్టు యాసంగి సాగుకు నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు నీటి వనరుల కట్టలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల గండ్లు పడ్డాయి. వాటి మరమ్మతులకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు మంజూరయిన వెంటనే టెండర్లు పిలిచి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. అన్నదాతలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. -ఏసయ్య, ఎస్ఈ, నీటిపారుదల శాఖ.

జాతీయ రహదారి.. గుంతలున్నాయి మరి!

పట్టణ పరిధి పోతిరెడ్డిపల్లిలో జాతీయ రహదారిపై ప్రమాదకర గుంతలు ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే వాహనదారులు గమనించకపోవడంతో కుదుపునకు గురవుతున్నారు. నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్నా తారు వేయడం లేదు. ఎన్‌హెచ్ డిప్యూటీ ఈఈ రామకృష్ణను వివరణ కోరగా.. గుత్తేదారుతో మాట్లాడి గుంతలు పూడ్చివేయిస్తామన్నారు.

– సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే.



కొమ్మలు నరకమంటే.. కాండంపై వేటేశారు



హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రణాళిక లేకుండా విద్యుత్తు తీగల కింద మొక్కలు నాటారు. అవి ఏపుగా ఎదిగాయి. చెట్ల కొమ్మలు నరకమని విద్యుత్తు శాఖ అధికారులు పంచాయతీ సిబ్బందికి సూచించారు. వారు ఏకంగా చెట్ల కాండంపైనే వేటేశారు. కోహీర్ మండలం కవేలి ప్రాథమిక పాఠశాల ముందు, కవేలి కూడలికి సమీపంలోని పరిస్థితి ఇది. –న్యూస్‌టుడే, కోహీర్.

'ట్రైడెంట్' పరిశ్రమకు మంచి రోజులొచ్చేనా?

జహీరాబాద్ మండలం కొత్తూరులోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో గానుగ(క్రషింగ్)కు అవసరమైన యంత్ర పరికరాల మరమ్మతులకు సోమవారం సర్వమత పూజలు నిర్వహించారు. ప్రార్థనల్లో పరిశ్రమ డైరెక్టర్ ఖీజర్‌యాపై, కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంజీ రాములు తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం పరిశ్రమ వివాదం(ఎన్‌సీఎల్‌టీ)లో ఉండగా.. ఆ సంస్థ నియమించిన ప్రతినిధి ఆధ్వర్యంలో గానుగ నిర్వహిస్తామని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. -న్యూస్‌టుడే, జహీరాబాద్.



కేతకిలో దేవీ శరన్నవరాత్రి వేడుకలకు ఏర్పాట్లు



ఝరాసంగం, న్యూస్‌టుడే: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకి సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. వేడుకలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు వేలాదిగా భక్తులు తరలిరానున్నారు. ఇందు కోసం ఆలయ అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయటమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో నియోజవర్గంలోని కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌తో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఇన్‌ఛార్జి ఆర్డీవో రాజు, ఆత్మకమిటీ ఛైర్మన్ వై.ప్రభు, సంగారెడ్డి, సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు రాంచందర్ నాయక్, సడాకుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన వాయిదా

రూ.2.50 కోట్ల నిధులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం హాజరు కావాల్సి ఉండగా.. కార్యక్రమాన్ని వాయిదా వేశారు.

ప్రజావాణికి 60 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ గ్రామాల నుంచి ప్రజలు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, శిక్షణ ఐఏఎస్ మనోజ్, డీఆర్వో పద్మజారాణిలు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలంటూ అభ్యర్థించారు. మొత్తం 60 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు.

- కంది మహిళా పొదుపు సంఘంలో రూ.30 లక్షలు పక్కదారి పట్టించారని, విచారణ జరిపించాలని మహిళా సంఘం సభ్యులు కోరారు.
- సంగారెడ్డిలోని ద్వారకానగర్‌లో రోడ్లు లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కరించాలని కోరారు.
- జహీరాబాద్‌లోని ఆదర్శ నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు విన్నవించారు.
- సంగారెడ్డిలోని ప్రధాన రహదారి పక్కన ఫుట్‌పాత్‌లపై అక్రమణలు తొలగించాలని కోరుతూ జాగృతి జనసేన ఆధ్వర్యంలో అధికారులకు ఫిర్యాదు చేశారు.

చిన్నారుల ఆరోగ్యానికి ప్రణాళిక

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తల్లీ బిడ్డల ఆరోగ్యం, విద్య, వికాసానికి వెయ్యి రోజుల ప్రణాళికతో ఐసీడీఎస్ పనిచేస్తోందని జిల్లా సంక్షేమాధికారిణి లలితకుమారి అన్నారు. జహీరాబాద్ పట్టణంలో సోమవారం ప్రాజెక్టు స్థాయిలో నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి హాజరయ్యారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాలు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు.

130 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కారులో తరలిస్తున్న 130.7 కిలోల గంజాయిని భద్రాచలంలోని కూరగాయల మార్కెట్ వద్ద ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఏఈఎస్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పట్టణ శివారులో నిఘా ఏర్పాటు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కారును గుర్తించి ఆపే ప్రయత్నం చేయగా.. ఆపకుండా పట్టణంలోకి దూసుకెళ్లారు. మార్కెట్ వద్ద నిలిపి డ్రైవర్ పరారయ్యాడు. దీంతో పట్టణంలో గాలించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుణ్ని జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఫరీద్‌గా గుర్తించారు. ఒడిశాలోని మల్కాన్‌గిరి నుంచి మహారాష్ట్రలోని ముంబయికి గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో నిందితుడు వెల్లడించాడని, దీని విలువ రూ.37.60 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడితోపాటు ఆ సరకు కొనుగోలు చేసిన ముంబయికి చెందిన యూసుఫ్ సహీద్‌ఖాన్‌పైనా కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ కరీం, సిబ్బంది బాలు, సుధీర్, వెంకట్, విజయ్ పాల్గొన్నారు.

పేరుకే ఆదర్శం.. ప్రవేశాల్లో అధమం


ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల

న్యూస్‌టుడే, నారాయణఖేడ్: మంచి ఆశయంతో ఖేడ్‌లో ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. సకల హంగులు కల్పించారు. ప్రవేశాలు మాత్రం కావడం లేదు. 12 ఏళ్ల కిందట దేశవ్యాప్తంగా 374 ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలు ప్రారంభమయ్యాయి. అప్పటి ఉమ్మడి ఏపీలో ఏడు కళాశాలలు ఏర్పాటయ్యాయి. అందులో నారాయణఖేడ్, కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డికి మాత్రమే కేటాయించారు.

రూ.14 కోట్లతో భవనం..: ఖేడ్ మండలంలోని జూకల్ శివారులో 161బి జాతీయ రహదారి పక్కన రూ.14 కోట్లు వెచ్చించి సకల హంగులతో కళాశాల భవనంతోపాటు బాలికలు, బాలురకు సంబంధించి వేర్వేరుగా వసతిగృహాలను నిర్మించారు. బీఏ (తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ బీజడ్సీ, బీఎస్సీ బీజడ్‌సీఎస్, ఎంపీసీ, ఎంపీసీఎస్, సీబీఎస్ఈ(ఆంగ్ల మాధ్యమం) కోర్సులున్నాయి. ప్రభుత్వం దోస్త్ ద్వారా సీట్లు భర్తీ చేస్తోంది. కళాశాలలో 900 మందికిగాను 281 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రథమ సంవత్సరంలో 300 సీట్లకుగాను ఈసారి 120 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. రెగ్యులర్ ప్రిన్సిపల్, నలుగురు ఒప్పంద అధ్యాపకులు, 8 మంది అతిథి అధ్యాపకులు ఉన్నారు. బాలురు, బాలికలకు సంబంధించిన వసతిగృహాల భవనాలు నిర్మించినా ఇంతవరకు ప్రవేశాలు మాత్రం కల్పించలేదు.

ఆంగ్ల మాధ్యమమే కారణమా?: ఖేడ్ ప్రాంతంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తెలుగు మాధ్యమ కోర్సులు అధికంగా ఉన్నాయి. డిగ్రీ కళాశాలలో బీఏ మినహా మిగిలిన కోర్సులు ఆంగ్ల మాధ్యమంలో ఉన్నందునే ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు కళాశాల ఖేడ్ పట్టణం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. వృత్తివిద్యా కోర్సులుంటే ప్రవేశాలు పెరగడానికి అవకాశముందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

కళాశాలకు విశాలమైన భవనం, అన్ని వసతులున్నా తెలుగు మాధ్యమంలో కోర్సులు లేకపోవడంతో విద్యార్థులు ప్రవేశాలకు ముందుకు రావడం లేదు. ప్రవేశాలు పొందేలా అవగాహన కల్పిస్తూ మా వంతు కృషి చేస్తున్నాం. విశ్వవిద్యాలయం వారు తెలుగు మాధ్యమంలో తరగతులు ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నాం. – నారాయణ, ప్రిన్సిపల్.

స్త్రీనిధి.. భవితకు పెన్నిధి

పాడి గేదెల కొనుగోలుకు రుణాలు

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, జోగిపేట, జహీరాబాద్

మహిళలు పొదుపు సంఘాల్లో చేరుతూ.. ఆర్థికంగా ఎదిగేందుకు బాటలు వేసుకుంటున్నారు. దీని వల్ల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. ఆ కుటుంబాలకు సామాజికంగానూ గుర్తింపు పెరుగుతోంది. స్త్రీనిధి రుణాలు కూడా తోడవటంతో స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. పాడిగేదెల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తున్నారు.

లక్ష్యం 500 యూనిట్లు

పాడి పశువుల యూనిట్లతో మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధికి బాటలు వేసుకునేందుకు వీలుంటుంది. మహిళా సంఘాల సభ్యుల్లో ఎక్కువ మంది వ్యవసాయ కుటుంబాలకు చెందిన వారే కావడంతో పశు పోషణకు కూడా ఇబ్బంది ఉండదు. ఈ సంవత్సరం జిల్లాకు స్త్రీనిధి ద్వారా 500 పాడి పశువుల పంపిణీ లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకోసం స్త్రీనిధి రుణాలతో పశువులు కొనుగోలు చేసిన మహిళా సంఘాల సభ్యులు పాల ఉత్పత్తుల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబానికి చేదోడుగా నిలుస్తూ రుణ వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. ఇప్పటికే 160 మంది లబ్ధిదారులను గుర్తించి రుణాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపారు.



- జిల్లాలో గ్రామైక్య సంఘాలు: 695
- మహిళా స్వయం సహాయక సంఘాలు: 18,208
- వాటిలో సభ్యులు: 1.91 లక్షలు
- ఈ ఏడాది రుణ లక్ష్యం: 137.80 కోట్లు
- ఇప్పటి వరకు పంపిణీ: 40.86 కోట్లు
- రుణ పంపిణీ శాతం: 29.65

లబ్ధి చేకూరుతోంది ఇలా..

గతంలో స్త్రీనిధి ద్వారా గేదె కొనుగోలుకు రూ.60వేలు ఇచ్చేవారు. గత సంవత్సరం నుంచి ఈ మొత్తాన్ని రూ.75 వేలకు పెంచారు. రెండు నెలలకు సరిపడా దాణా ఖర్చు కింద రూ.7,200, రవాణా ఖర్చు కింద రూ.3వేలు కలిపి లబ్ధిదారు ఖాతాలో రూ.85,200 జమచేస్తారు. సభ్యురాలు వాటాధనం కింద రూ.1,704 జమచేస్తే ఆ మొత్తాన్ని ఆరు సంవత్సరాల తర్వాత డివిడెండ్‌తో కలిపి తిరిగి చెల్లిస్తారు. పాడి పశువును ఇతర రాష్ట్రాల్లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కొనుగోలుకు సంబంధించిన వివరాలను యాప్‌లో నమోదు చేయడం తప్పనిసరి. 48 సమాన వాయిదాల్లో తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

రుణ పరిమితి పెంపుతో మేలు

పాడిగేదెలకు రుణ సదుపాయంతో మహిళా సంఘాల సభ్యులకు ప్రయోజనం చేకూరుతోంది. స్వయం ఉపాధికి ఇది బాటలు వేస్తోంది. పాల ఉత్పత్తులతో నెలనెలా వాయిదాలు చెల్లింపు సులభమవుతోంది. రుణాలకు సంబంధించిన ప్రక్రియ అంతా గ్రామైక్య సంఘం స్థాయిలో జరిగేలా చూస్తున్నాం. గ్రామైక్య సంఘం ట్యాబ్‌లో వివరాలు నమోదు ద్వారా స్వల్ప వ్యవధిలో రుణాలు మంజూరుకు అవకాశం ఉంటుంది. –శ్రీనాథ్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్.

దసరా లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ

మెదక్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారని ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆమె, మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై చర్చించారు. పలు సమీకరణాలపై చర్చ అనంతరం ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యిపై నిరసన

సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీనెయ్యి వినియోగించారన్న ఆరోపణలపై విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో సోమవారం సంగారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వీహెచ్‌పీ ధర్మ ప్రసార ప్రాంత ప్రముఖ్ ఎం.సుభాష్ చందర్, సహ ప్రముఖ్ బ్రహ్మానందం, జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయమై బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు.


సంగారెడ్డిలో విశ్వహిందూ పరిషత్ నాయకుల ర్యాలీ

నిత్య సాధనతోనే క్రీడల్లో రాణింపు


పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్


నారాయణఖేడ్ రూరల్, న్యూస్‌టుడే: నిత్యం సాధన చేస్తేనే క్రీడల్లో రాణిస్తారని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డితో కలిసి నిజాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం జిల్లా స్థాయి కుస్తీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓడిన వారు విజయానికి ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

ఆత్మీయ నేస్తాలు.. ప్రాణదాతలు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

అత్యవసరం ఏర్పడితే.. బంధం లేకున్నా రక్తదానం చేసే దాతలు ఎందరో ఆదర్శంగా నిలుస్తున్నారు. నిండు ప్రాణాలు నిలబెట్టే వారు ప్రత్యక్ష దైవంగా భావిస్తుంటాం. చిన్నారి మొదలు వృద్ధుల వరకు వివిధ సమయాల్లో రక్తం దొరక్క అల్లాడుతుంటారు. వారికి మేమున్నామంటూ రక్తదానం చేసే వారు ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో భారీగా ఉండటం విశేషం. ఏ సమయమైనా ముందుకొస్తున్నారు. వ్యక్తిగతంగా, బృందాలుగా బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. అలాంటి ఆత్మీయులపై జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

ఈ సారు.. 49 సార్లు



సిద్దిపేట వాసి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. హుస్సేన్ ఇప్పటి వరకు 49 సార్లు రక్తదానం చేశారు. ఓ+ గ్రూపు కాగా.. 18వ ఏట నుంచే ఇస్తున్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ఓ మహిళకు అత్యవసరం కాగా, వెంటనే స్పందించడంతో ప్రాణం నిలబడటం సంతృప్తినిచ్చింది. అప్పటి నుంచి 30 ఏళ్లుగా అత్యవసరంలో స్పందిస్తున్నారు. సర్కారు దవాఖానాల్లో చికిత్స పొందే నిరుపేదలకు తొలి ప్రాధాన్యంగా రక్తదానం చేస్తున్నారు.

సామాజిక బాధ్యతగా..



సిద్దిపేట జిల్లాలో సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. పోలీసు బ్లడ్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ గ్రూపు (సిద్దిపేట), సిద్దిపేట బ్లడ్ బ్యాంకు వంటి వాట్సాప్ గ్రూప్‌ల్లో అన్ని వర్గాల వారు భాగస్వాములయ్యారు. ఆరేళ్లలో 2500 మందికి పైగా రక్తదానం చేశారు. 2 వేల మంది వివరాలు ఉండగా, సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు కుకునూరుపల్లి పోలీసు కానిస్టేబుల్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు.



యువ సారథ్యం.. స్ఫూర్తి మంత్రం



బీఎస్‌డీఎఫ్ (భారత్ సొసైటీ డెవలప్‌మెంట్ ఫోర్సు) ఆధ్వర్యంలో పదేళ్ల కిందట బ్లడ్ సర్కిల్ గ్రూపు ఏర్పాటు చేశారు. అనుబంధంగా 16 వాట్సాప్ గ్రూపులు ఉండగా.. వాటిల్లో మొత్తం 2 వేల మంది సభ్యులున్నారు. రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసరంలో ఏటా 300 మంది స్పందిస్తున్నారు. స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు నాగార్జున్, సమన్వయకర్త భాను వెల్లడించారు.



రక్తదాతలు

తల్లిదండ్రుల ఆనందం చూసి..



2011లో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారికి రక్తదానం చేయగా.. ఆ తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనందం అతడికి రక్తదానం చేసేలా ప్రేరేపించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 48 సార్లు రక్తదానం చేశారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడకు చెందిన బూర్జుకాడి నరేష్, ఎంకాం చదువుతున్నప్పుడు అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి పని చేయడం ఈ దిశగా అడుగేయడానికి తోడ్పడింది.

శిబిరాలు నిర్వహిస్తూ..



సంగారెడ్డి జిల్లా నాగలిగిద్ద మండలం ఉట్‌పల్లికి చెందిన **ఓంప్రకాశ్**.. ఇప్పటివరకు 40 సార్లు రక్తదానం చేశారు. ఇతడిది ఓ- నెగెటివ్ గ్రూప్. ఈ గ్రూప్ వారు అరుదుగా ఉంటారు. రెండు నెలలకోసారి నారాయణఖేడ్‌లో శిబిరాలు నిర్వహిస్తూ యువత రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. 63050-43932 నంబరుకు ఫోన్ చేస్తే చాలు దానం చేయడానికి సిద్ధంగా ఉంటారు.

ఎవరు చేయొచ్చంటే..

- 18 - 55 ఏళ్లున్న వారు ఎవరైనా రక్తదానం చేయొచ్చు.
- మూడు నెలల వ్యవధితో ఏడాదికి నాలుగుసార్లు ఇవ్వొచ్చు.
- ఒక వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చు.

159 సార్లు ముందుకొచ్చి..



ఎవరికైనా రక్తం అత్యవసరమని తెలిస్తే చాలు వెంటనే అక్కడికి వెళ్లిపోతారు...తాండూరుకు చెందిన వైద్యుడు సంపత్‌కుమార్.. ఇప్పటివరకు 159 సార్లు రక్తదానం చేశారు.

నాన్న స్ఫూర్తితో..



సంగారెడ్డికి చెందిన సాజీద్ అలీ తండ్రి షబ్బీర్‌అలీ. నాన్న స్ఫూర్తిగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న కాన్పు, రోడ్డు ప్రమాదాల బాధితులకు రక్తం ఇచ్చి కాపాడారు. ఎవరికైనా, ఎప్పుడైనా అత్యవసరమైతే 96527-86001 నంబరుకు ఫోన్ చేస్తే చాలు సిద్ధంగా ఉంటారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి అర్బన్, తాండూరు నారాయణఖేడ్ రూరల్, మెదక్ టౌన్

'మల్లన్న' హుండీ ఆదాయం రూ.63.66 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.63.66 లక్షల నగదుతో పాటు బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు ఈవో ఆలూరు బాలాజీశర్మ తెలిపారు. మెదక్ జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో సోమవారం మొత్తం 24 హుండీలను విప్పి భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాల లెక్కింపు చేపట్టారు. రూ.63,66,933 నగదు, 51 గ్రాముల మిశ్రమ బంగారం, ఒక కిలో 50 గ్రాముల మిశ్రమ వెండి కానుకలు, 25 విదేశీ కరెన్సీ, 6 క్వింటాళ్ల బియ్యం వచ్చినట్టు చెప్పారు. ఇది 76 రోజుల్లో సమకూరిందని పేర్కొన్నారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది, సిరిసిల్లకు చెందిన శివరామకృష్ణ భజన మండలి 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

విదేశీ భాషలు నేర్చుకుంటే ఉన్నతస్థానం

సిద్దిపేట టౌన్: విదేశీ భాషలు నేర్చుకుంటే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇఫ్లూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాఠశాలలో విదేశీ భాషలు నేర్చుకున్న విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. పలువురు విద్యార్థులు తాము నేర్చుకున్న ఇంగ్లిష్, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో సంభాషించి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. పాఠశాల కోసం ఆడిటోరియం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదనపు తరగతి గదులు, మురుగు పారుదల వ్యవస్థకు నాట్కో నుంచి రూ.40 లక్షలు ఇస్తామని చెప్పారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ తన సొంత ఖర్చుతో ఐప్యాడ్‌లు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులను సన్మానిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, భారాస నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు సాంకేతికత అవసరం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ, అనురాగ్ వర్సిటీ అధికారులు

ములుగు: ఉద్యాన పంటల సాగులో సాంకేతిక విద్య ఎంతో అవసరమని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజ ప్రభాకర్ అన్నారు. సోమవారం పరిపాలన విభాగం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ వర్సిటీ, ఉద్యాన విశ్వవిద్యాలయం మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నాయి. భవిష్యత్తులో రెండు సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు లక్ష్మీనారాయణ, రాజశేఖర్, విజయ, అనురాగ్ విశ్వవిద్యాలయం అధికారులు అర్చన, నారాయణరెడ్డి, ప్రతిభ పాల్గొన్నారు.



చికెన్ ధరలు			
ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

హ్యాండ్‌బాల్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్ల ఎంపిక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక చేశారు. స్థానిక మినీ స్టేడియంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు అక్టోబరు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగే టోర్నీలో పాల్గొంటారు. హెచ్ఎం వాసుదేవరెడ్డి, పుర ఉపాధ్యక్షురాలు ఐలేని అనిత, లింగమూర్తి, రాజు, ఆర్. శ్రీనివాస్, కౌన్సిలర్లు నళిని, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారతసైన్యానికి మరో అధునాతన ఆయుధం



ఆయుధాల వాహనాన్ని ప్రారంభిస్తున్న మేజర్ జనరల్ రాకేశ్‌కుమార్ మనోచా

మనోహరాబాద్, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో డీఆర్‌డీవో, భారత సైన్యం సహకారంతో మేకిన్ ఇండియాలో భాగంగా అధునాతన మెషిన్‌గన్‌ను తయారు చేశామని లోకేశ్ మెషిన్ లిమిటెడ్ కోఛైర్మన్ శ్రీకృష్ణ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామికవాడలో లోకేష్ మెషిన్ పరిశ్రమ తయారు చేసిన 9x19 ఎంఎం 550 మెషిన్‌గన్‌లను సోమవారం దిల్లీకి తరలించే వాహనాన్ని మేజర్ జనరల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎస్ఎం, వీఎస్ఎం, జీవోసీ రాకేశ్‌కుమార్ మనోచా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీకృష్ణ, ఆర్మీ అధికారులు ఘన స్వాగతం పలికారు. పరిశ్రమలో ప్రదర్శనకు ఉంచిన ఆయుధాల పనితీరు, తయారీకి వాడిన ముడి సరకుల సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి ముడిసరకు దిగుమతి చేసుకోకుండా తయారు చేయడం మంచి పరిణామమని, ఇలాంటివి భారత సైన్యానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ లోకేశ్వరరావు, విశ్రాంత ఆర్మీ అధికారి రాజీవ్ శర్మ, ఆర్మీ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట టౌన్: నిజామాబాద్‌లో ఇటీవల తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-18 విభాగంలో రిథమిక్ పేర్(జంట) అంశంలో ఎల్. సింధూరి, మనీషా స్వర్ణాలు సాధించారు. 45 -55 పురుషుల విభాగంలో ట్రెడిషనల్ అంశంలో పల్లె సురేశ్ స్వర్ణ పతకం, మహిళల విభాగంలో ఉమాదేవి నాలుగో స్థానంలో నిలిచారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు వారిని శిక్షకులు సతీష్, సంధ్యలను అభినందించారు.

మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు



అరెస్టయిన నిందితులు

రెజిమెంటల్‌బజార్: మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు, చోరీ వస్తువులను కొనుగోలు చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు వారి నుంచి 20 చరవాణులు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత పండ్లు విక్రయిస్తుంది. మేడ్చల్‌కు చెందిన ఆమె మరిది వాంకుడోత్ ప్రసాద్ ఆటోడ్రైవర్. వచ్చే ఆదాయం చాలక ఇద్దరూ కలిసి చోరీల బాటపట్టారు. రద్దీ ప్రాంతాల్లో, ఆర్టీసీ బస్సుల్లో, మహిళల బ్యాగుల్లోని చరవాణులు దొంగిలించి, వాటిని కాచిగూడకు చెందిన మహ్మద్ రఫీయుద్దీన్, మహ్మద్ ఇస్మాయిల్‌కు విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు రాగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగానేరం అంగీకరించారు. గోపాలపురం, ఉప్పల్, కామారెడ్డి, ఓయూ, గౌరారం, సిద్దిపేట, పేట్‌బషీరాబాద్, రామాయంపేట, మేడ్చల్ పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. గతంలోనూ 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. సొత్తు కొనుగోలు చేసిన వారినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పూల తోట.. సస్యరక్షణతోనే దిగుబడి

రైతేరాజు

న్యూస్‌టుడే, చేర్యాల

డిమాండ్‌తో పాటు సీజన్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకం. రానున్నది పండుగల సీజన్. ఈ తరుణంలో పూలకు డిమాండ్‌కు అధికంగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలు, మారిన వాతావరణంతో పూల తోటల్లో సస్యరక్షణ చర్యలు ఎంతో అవసరం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో బంతి, చామంతి, మల్లె, కనకాంబరం ఎక్కువగా తోటలు సాగు చేస్తున్నారు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ ఇలా వివరించారు.


బంతి..: బంతి తోటలో ప్రస్తుతం పేనుబంక సమస్య అధికంగా ఉంటుంది. ఇవి మొక్కలోని రసాన్ని పీల్చుకుంటాయి. ఆశించిన దిగుబడి రాదు. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి 15 రోజులకోసారి పిచికారీ చేయాలి. దీపపు పురుగులు ఆకులపై ఎక్కువగా ఆశిస్తాయి. నివారణకు 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి చల్లాలి.



- గొంగళి పురుగు ఆశించి కొనభాగాలను తిని ఈనెలను మిగులుస్తాయి. స్పైనోశాడ్ 0.3మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ 1 మి.లీ... లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.

గులాబీ..: గులాబీ తోటలకు పెంకు పురుగులు ఆశించి రాత్రివేళ ఆకులు తిని నష్టం కలిగిస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకులపై బూడిద తెగులు ఆశిస్తే బూడిద వంటి తెల్లటి పదార్థం ఏర్పడి ఆకులు ముడుచుకుంటాయి. నివారణకు ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా డినోకాప్ 1 మి.లీ. మందు లీటరు నీటికి కలిపి చల్లాలి. ● ఎండు తెగులు ఆశించి మొక్క పైభాగం నుంచి కిందికి ఎండిపోతుంది. నివారణకు తెగులు సోకిన కొమ్మను కత్తిరించాలి. ఆయా చోట్ల కాపర్ ఆక్సీక్లోరైడ్ వేస్తును పూయాలి.

మల్లెపూలు..: ప్రస్తుతం మల్లె తోటలకు మొగ్గతొలుచు పురుగు ఆశిస్తోంది. పురుగు లార్వా మొగ్గలోకి చొచ్చుకెళ్లి తినేస్తుంది. నివారణకు మలాథియాన్ మందు 2 మి.లీ. లేదా థయాక్లోప్రిడ్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.



కనకాంబరం..: ఈ తోటలకు ప్రస్తుతం నులిపురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి వల్ల ఆకులు ముడుచుకొని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారుతాయి. నివారణకు 10కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి భూమిలో కలిపి నీరు పెట్టాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండి వేయాలి. ఎండు తెగులు సోకి ఆకులు కిందికి వాలుతాయి. కాండం కుళ్లిపోతుంది. చివరకు మొక్కలు చనిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ లేదా 0.75 గ్రా. ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్‌తో టెబుకోనజోల్‌ను కలిపి 20-25 మి.లీ. మందు ద్రావణంతో మొక్క మొదలు చుట్టూ నేల తడిసేలా చల్లాలి.

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: 93815 15588

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తికి పచ్చ దోమ ఆశించింది. నివారణ చర్యలు తెలపండి?

– సుదర్శన్, చేగుంట

సమాధానం: 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, ఎసిఫేట్ 1.5 గ్రాములు, ఫిప్రోనిల్ 2 మి.లీ... లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, చేర్యాల

పాటించు.. నివారించు..



వాతావరణంలో మార్పులతో కాకర తోటలకు చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. పండు ఈగ ఆశించి నష్టపరుస్తుంది. సన్నని పురుగులు కాయ గుజ్జును తినేస్తాయి. నివారణకు లీటరు నీటిలో మలాథియాన్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. రాలిపోయిన కాయలను ఏరి కాల్చివేయాలి. ఎకరాకు 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలి. ● ప్రస్తుతం పాముపొడ పురుగు ఆశిస్తుంది. గొంగళి పురుగు మాదిరిగా ఉండి ఆకు పొరల్లో చొచ్చుకుపోతాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి. పూత వచ్చే వరకు 5 శాతం వేప గింజల కషాయాన్ని 15 రోజులకోసారి చల్లాలి.


- న్యూస్‌టుడే, పాపన్నపేట


పత్తిలో ఆకుమచ్చ తెగులా..

ఇటీవలి భారీ వర్షాల అనంతరం పత్తి పంటను ఆకు మచ్చ తెగులు, పిండినల్లి పురుగులు ఎక్కువగా ఆశిస్తున్నాయి. వీటి నివారణకు తగిన మోతాదులో మందులు వాడాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్లాంటో మైసిన్ లేదా స్ట్రెప్టోమైసిన్ 0.2 గ్రా., కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా... లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పిండినల్లి పురుగు నివారణకు లీటరు నీటికి 2 గ్రా. ఎసిఫేట్‌తో పాటు 1 మి.లీ. శాండోవిట్ జిగురు మందు కలిపి మొక్క తడిచేలా పిచికారీ చేయాలి.

– జహీరాబాద్ అర్బన్

సమయానుకూల సాగు.. లాభాలు బాగు





సమయం, డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకమని నిరూపిస్తున్నారు గుమ్మడిదల మండలం వీరన్నగూడెంకు చెందిన రాంచందర్. ఈయనకు రెండెకరాల పొలం ఉంది. ఇందులో సాధారణంగా వరితో పాటు కూరగాయలు సాగు చేస్తుంటారు. పండగలు సీజన్ వచ్చిందంటే మాత్రం పూల సాగు బాట పడతారు. ఏటా దసరా, దీపావళి, కార్తిక మాసం వచ్చే ముందు బంతి పూలు పండిస్తున్నారు. ఎకరా పొలంలో ఎర్ర, పసుపు పచ్చ రకాలను సాగు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు తెచ్చి నాటడంతో పాటు అన్ని రకాల సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. నాటు వేసింది మొదలు పూత వచ్చే వరకు నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటారు. పురుగులు ఆశించినట్లు గుర్తించగానే అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేస్తున్నారు. విత్తనాలు, మందులు, ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దసరా నుంచి మొదలుకొని కార్తికమాసం చివరి వరకు నాలుగు కాతలు చేతికొస్తున్నాయి. ఒక్కో కాతకు ఎకరాకు 6 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోంది. మొత్తం సీజనలో 24 క్వింటాళ్ల మేర దిగుబడి సాధిస్తున్నారు. హైదరాబాద్, జిన్నారం, బొంతపల్లి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. వీటి అమ్మకం ద్వారా రూ.లక్ష వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోను రూ.50 వేల వరకు మిగులుతోంది. ఈ లెక్కన ఎకరాలో పూల సాగుతో రూ.2 లక్షల వరకు ఆర్జిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

- న్యూస్‌టుడే, గుమ్మడిదల

పోలీసులు వచ్చె.. గ్రామస్థులు అడ్డుకునే..

గురువన్నపేటలో రెండో రోజూ ఉద్రిక్తత



నిందితుడి ఇంటిపై దాడి చేసిన వారిని పోలీసులు తీసుకెళ్తుండగా అడ్డుకుంటున్న గ్రామస్థులు

చేర్యాల, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం ఘటన జరిగిన సిద్దిపేట జిల్లా చేర్యాల సర్కిల్ పరిధిలోని గురువన్నపేట గ్రామంలో రెండో రోజు సోమవారమూ ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం నిందితుడి ఇంటికి నిప్పు పెట్టి, కారు ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదైన నిందితులను అదుపులోకి తీసుకోవడానికి సోమవారం ఉదయం పోలీసులు గ్రామానికి వచ్చారు. వారిలో ఆరుగురిని వాహనంలో ఎక్కించుకొని తరలిస్తుండగా పోలీసు వాహనాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. దారికి అడ్డంగా బైఠాయించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై రాజు చేరుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించారు. అదుపులోకి తీసుకున్న వారిని వదిలిపెట్టాలని గ్రామస్థులు నినాదాలు చేశారు. గత్యంతరం లేక చివరకు వాహనాల్లో ఉన్న ఆరుగురిని పోలీసులు వదిలిపెట్టారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. అత్యాచార బాధిత కుటుంబాన్ని భాజపా మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, మహిళ విభాగం అధ్యక్షులు లక్ష్మి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సురేశ్, నాయకులు పరామర్శించారు. నిందితుడికి కఠిన శిక్ష పడాలని వారు డిమాండ్ చేశారు.

అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తా

ఒకరి దుర్మరణం పలువురికి గాయాలు

దౌల్తాబాద్: అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఈర్లపల్లి నుంచి నాగసార్‌కు బంధువుల అంత్యక్రియల నిమిత్తం ట్రాక్టర్‌లో బయలుదేరారు. దేవర్‌పస్లావాద్ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈర్లపల్లికి చెందిన మాల అమృతమ్మ (51) అక్కడికక్కడే మృతి చెందింది. మాల కిష్టప్ప, నర్సమ్మ, అచ్చన్న, కవిత, దస్తమ్మ, బామమ్మ, బనప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనాల్లో కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుడు లాలప్ప ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కారు టైరు పేలి ఒకరు..

బొంరాస్‌పేట (కొడంగల్): వేగంగా వెళ్తున్న కారు టైర్ పేలడంతో ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రవూఫ్ తెలిపిన వివరాలు.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని మల్కేడ్‌కు బయల్దేరిన ఓ కారు బొంరాస్‌పేట చెరువు మలుపు వద్ద టైర్ పేలి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ (49) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు.. రవికుమార్, రవిచంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు మల్కేడ్ వాసిగా గుర్తించారు. భాస్కర్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

బైక్‌తో చెట్టును ఢీకొని మేస్త్రీ..

వెల్దుర్తి: అతివేగంగా ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఏఎస్ఐ సాదత్‌మియా తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా ఎమునూర్‌కు చెందిన కట్ల రమేష్(35) మండలంలోని మానేపల్లిలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్న అదే జిల్లాకు చెందిన పాలపర్తి శ్రీనివాస్ వద్దకు పది రోజుల క్రితం వచ్చాడు. అతడి వద్ద పనికి చేరాడు. సోమవారం మానేపల్లి పక్క గ్రామం అందుగులపల్లికి పని నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి బయల్దేరాడు. వేగంగా వస్తూ అందుగులపల్లి శివారులో ఓ చెట్టుకు ఢీకొట్టి పడిపోగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడు రమేష్ వివరాల కోసం శ్రీనివాస్‌ను అడగ్గా భార్యాపిల్లలు ముంబయిలో ఉంటారని, వారి చిరునామా తెలియదని చెప్పాడు. ఇంకా ఫిర్యాదు అందలేదని, రాగానే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ వివరించారు.

బాలిక మరణానికి కారణమైన.. దంపతులకు జీవిత ఖైదు

సంగారెడ్డి అర్బన్: ఐదేళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేసి మరణానికి కారణమైన దంపతులకు జీవిత ఖైదు విధిస్తూ ఫ్యామిలీ కోర్టు నాలుగో సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్‌రెడ్డి సోమవారం తీర్పు ఇచ్చిందని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ జకీర్ అహ్మద్ హెడ్ కానిస్టేబుల్. గతంలో ఐడీఏ బొల్లారంలో పని చేశాడు. సతీమణి రజియా సుల్తానాతో కలిసి కొండాపూర్‌లో నివాసం ఉన్నాడు. వారింట్లో ఐదేళ్ల బాలికను పనిలో పెట్టుకున్నారు. పని సరిగా చేయ లేదని బాలికను చితకబాదగా.. అపస్మారకస్థితికి చేరింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. 2015, జనవరి 29న ఈ ఘటన జరిగింది. ఛైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి ఎం.ఎస్. చంద్ర కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో వివరాలు సమర్పించారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి దంపతులిద్దరికీ జీవితఖైదు విధించారు.

రెండోసారి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



మంగవ్వ

దుబ్బాక: ఆర్నెల్ల క్రితం బావి వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని ఓ వృద్ధురాలు యత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు. సెప్టెంబరు 22న ఆమె మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్ఐ వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని అప్పనపల్లికి చెందిన గ్యార మైసయ్య కూలీ పనులు చేస్తూ, భార్య మంగవ్వ (66), ఇద్దరు కుమారులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగవ్వకు మద్యం తాగే అలవాటుంది. సెప్టెంబరు 22న బంధువు అంత్యక్రియలకు వెళ్లి, మద్యం తాగి ఇంటికి వచ్చింది. కుటుంబీకులతో గొడవపడింది. గడ్డి మందు తాగింది. కుటుంబీకులు గుర్తించి 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మైసయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పంపుహౌస్ ప్రైవేటు ఇంజినీర్ ఆత్మహత్య



వెంకటేశ్

గజ్వేల్ గ్రామీణ: కొండపోచమ్మ సాగర్‌కు సంబంధించిన పంపుహౌస్ వద్ద ఇంజినీర్‌గా పని చేస్తున్న యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా మక్తమాసాన్‌పల్లికి చెందిన చింత వెంకటేశ్ (26)కు భార్య శిరీష, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. గజ్వేల్ మండలం అక్కారం శివారు పంపుహౌస్‌లో ప్రైవేటు కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరైన వెంకటేశ్.. తోటి ఉద్యోగులు రమ్మని పిలిచినా మధ్యాహ్న భోజనానికి వెళ్లలేదు. అందరూ భోజనానికి వెళ్లగానే తాను ఉన్న గదిలోనే ఉరేసుకున్నాడు. తోటివారు వచ్చి కిందికి దించి గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకటేశ్ మృతి చెందినట్లు వైద్యులు తేల్చిచెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

వేతనాలు చెల్లించడం లేదని నిరసన



నారాయణఖేడ్: ఖేడ్ మండలం జుకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో, జూనియర్ కళాశాల తాత్కాలిక ఉపాధ్యాయులు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని నిరసన చేపట్టారు. ఇతర శాఖల్లోని తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు అందుతున్నా.. స్థానికంగా ఎందుకు ఇవ్వడంలేదని వారు ప్రశ్నించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం: సీపీఎం

కొండాపూర్: ప్రజా సమస్యలపై పోరాటం చేసేది సీపీఎం పార్టీయేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సోమవారం మహాసభలను పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. ఆ పార్టీ నాయకులు రాజయ్య, నర్సింహారెడ్డి, బాబురావు, అమృతమ్మ తదితరులున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం!

కరవైన ప్రత్యేకాధికారుల నిఘా

కంది, గుమ్మడిదల, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో కాల్వలు సక్రమంగా లేకపోవడంతో మురుగు ఇళ్ల మధ్యలో మడుగులా చేరుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాల్వల్లో పూడిక పేరుకుపోయి దోమలు పెరిగాయి. ప్రత్యేక అధికారులు మాత్రం అటువైపు చూడకపోవడంతో స్థానిక కార్యక్రమాల నిర్వహణ భారమంతా కార్యదర్శులపై పడుతోంది.



చెర్యాల్ శ్రీరాం కాలనీ ఇళ్ల మధ్యలోనే మురుగు

ఇళ్ల మధ్యనే మడుగులు

కంది మండలం మామిడిపల్లి దారిలో మురుగు కాల్వ ధ్వంసం కావడంతో రాత్రివేళలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కవలంపేటలో ప్రధాన దారిలోని కాల్వ పాడవడంతో నిండింది. చెర్యాల్‌లోని శ్రీరాం కాలనీలో ఇళ్ల మధ్యలో మురుగు నిలుస్తోంది. ప్రధాన కాల్వలో అండర్ డ్రైనేజీ పైపులు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. జుల్కల్‌లోని సైడ్ కాల్వలు చెత్తాచెదారంతో నిండి ఆవాళ్లు కల్పోయాయి.

చినుకు పడితే చిత్తడే

గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామం ఎస్సీ బస్తీలో కాల్వల్లో చెత్తాచెదారం చేరడంతో వరద రోడ్లపై ప్రవహిస్తుంది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా.. వరద పోటెత్తుతోంది. పారిశుద్ధ్యాన్ని పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో దుర్గంధం వ్యాపించి దోమలు చేరి సమీపంలోని ఇళ్లవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు రోగాలబారిన పడుతున్నారని బొంతపల్లి బస్తీవాసులు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: డీఎల్‌పీఓ. అనిత

గ్రామాల్లో మురుగు కాల్వలు అధ్వానంగా మారిన తీరును పరిశీలన చేస్తాం. కాల్వలు ఉన్న ప్రాంతాల్లో పూడిక తొలగించడంతో పాటు చెత్తాచెదారం తీయించి శుభ్రత చర్యలు తీసుకుంటాం. కొన్ని ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీ పైపులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే ఆ పనులు చేయిస్తాం. ఇళ్ల మధ్యలో పారుతున్న మురుగు తొలగించి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం. ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ

? సంగారెడ్డి పట్టణం ద్వారకనగర్‌లో రోడ్డు అధ్వానంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారి ప్రయాణించేందుకు ఇబ్బందిగా మారింది. – శివ కుమార్, స్థానికుడు.

✓ గుంతలు ఉన్న చోట తాత్కాలికంగా మొరం వేయిస్తాం.
– ఇంతియాజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.

? సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధి కాకతీయనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు బయటకు రావాలంటే భయంగా ఉంది.
– రాజేశ్వర్, సంగారెడ్డి

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
– ప్రసాద్ చౌహాన్, పురపాలక కమిషనర్.

సదుపాయాలు కల్పిస్తాం.. చక్కగా చదువుకోండి: సంజీవరెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: గురుకులాల్లో అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని, విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. జుకల్ శివారులోని మహాత్మా జ్యోతిబా పులె బీసీ బాలుర గురుకులంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ దీపాలను సోమవారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పురపాలక ఉపాధ్యక్షుడు దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్‌చౌహాన్, హన్మాండ్లు, బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌చౌహాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి పాల్గొన్నారు.● ఖేడ్ మండలం జుకల్, జుకల్‌తండాలకు చెందిన చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి పాల్గొన్నారు. ● పంచగామలోని పంచవటి క్షేత్రంలో ఎమ్మెల్యే పూజలు చేసి పీఠాధిపతి కాశీనాథ్‌బాబా ఆశీస్సులు తీసుకున్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, దిగంబర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వీర్‌రెడ్డి పాల్గొన్నారు.

'శివాలయ' స్థలానికి హద్దులు నిర్ణయించండి

జిన్నారం: జిన్నారంలోని శివాలయ స్థలానికి హద్దులు నిర్ణయించాలని గ్రామ అభివృద్ధి నాయకులు తహసీల్దార్ భిక్షపతికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, పుట్టి భాస్కర్, నరేందర్, రమేశ్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గీత కార్మికులకు రక్షణ కిట్లు

కంది: తాటిచెట్టు ఎక్కే గీత కార్మికులకు ప్రభుత్వం రక్షణ కిట్లు ఇస్తోందని వెనుకబడిన తరగతుల జిల్లా అభివృద్ధి అధికారి జగదీష్ పేర్కొన్నారు. సోమవారం చిద్రుప్పలోని తాటివనంలో గీత కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అందరికీ సమాన హక్కులు

సిర్గాపూర్, కల్హేర్, న్యూస్‌టుడే: రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కల్పించుకుంటే ప్రతి నెలాఖరున పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సిర్గాపూర్ తహసీల్దార్ ఉమాశంకర్ తెలిపారు. మండల పరిధి పోచాపూర్‌లో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

కొండాపూర్, న్యూస్‌టుడే: చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ అన్నారు. సోమవారం కొండాపూర్ మండలం గిర్మాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల- కళాశాలలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన కోళ్లఫాంపై ఫిర్యాదు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: మండలం పరిధిలోని అల్మాయిపేట శివారు తిర్మనాయి చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా కోళ్లఫాం నిర్మించారని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో గ్రామస్థులంతా కలిసి ఫిర్యాదు చేసినట్లు మొగులయ్య, బుచ్చయ్యలు తెలిపారు.

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్నప్రసాద్ అన్నారు. కళాశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో సోమవారం శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సుమతి, డాక్టర్ సదయ కుమార్, జ్యోష్న, ఎన్‌సీసీ అధికారి విజయ పాల్గొన్నారు.



తారా కళాశాలలో చెత్తను తొలగిస్తూ..

సంగారెడ్డి గ్రామీణ: రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ఎస్ భాగంగా సోమవారం పసల్వాది ఉన్నత పాఠశాలలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి, శుభ్రత చర్యలు చేపట్టారు.

పచ్చదనం, పరిశుభ్రతలు బాధ్యతగా గుర్తించాలి

వటపల్లి, న్యూస్‌టుడే: సమాజంలోని ప్రతి ఒక్కరు పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యతగా భావించాలని ఎంపీడీవో రామలింగం అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వటపల్లి ఆరోగ్య ఉప కేంద్రం ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి, పారిశుద్ధ్య కార్మికులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. నాయబ్ తహసీల్దార్ శంకర్‌రెడ్డి, ఏపీఎం చంద్రశేఖర్, సీసీ మల్లేశం, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.

వీరభద్రేశ్వర ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

రాయికోడ్, న్యూస్‌టుడే: రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ హుండీని సోమవారం లెక్కించగా రూ.3.54 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ శివరుద్రప్ప తెలిపారు. సోమవారం రాయికోడ్‌లో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శివరాజ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, జూనియర్ సహాయకుడు కృష్ణ, మాజీ చైర్మన్ మాణయ్య, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఐడీఏ బొల్లారం(జిన్నారం), న్యూస్‌టుడే: ఐడీఏ బొల్లారం పురపాలిక పరిధిలోని 12, 13, 14 వార్డుల్లో సీసీ రోడ్డు పనులు పుర అధ్యక్షురాలు రోజారాణి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కౌన్సిలర్లు వేణుపాల్‌రెడ్డి, ఏఈ కిష్టయ్య పాల్గొన్నారు.

మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేట టౌన్: మద్యం తాగి పట్టుబడిన వాహనదారులకు సోమవారం సిద్దిపేట జిల్లా ద్వితీయశ్రేణి జ్యుడిషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. కొన్ని రోజుల కిందట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా ఎనిమిది మంది మద్యంతాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ.15,500 జరిమానా విధించారు.

భగీరథ నీరు వృథా.. ప్రజలకు వ్యథ

నాగల్‌గిద్ద మండలం వల్లూర్‌లోని మంచి నీటి ట్యాంకు నుంచి భగీరథ నీరు వృథాగా పోతుంది. అక్కడి నుంచి వెళ్తున్న నీరు పాఠశాల ముందునుంచి వెళ్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్వచ్ఛమైన నీరు వృథాగా పోతుండటంతో అధికారులు విన్నవించినా పట్టించుకునే వారే కరవయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టేలా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నారాయణఖేడ్ టౌన్.



ప్రమాదకర మలుపులు... కరవైన సూచికలు

సింగూరు- సంగారెడ్డి ప్రధాన రహదారిపై పుల్కల్- మిన్‌పూర్ గ్రామాల మధ్య పలు మలుపులు ప్రమాదకరంగా మారాయి. దారికి ఇరువైపులా పెరిగిన పొదల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో ఎదురుగా ఇంకో వాహనం వచ్చే దారి ఇవ్వడానికి చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు నిత్యం ఈ మలుపుల రోడ్డుపై నుంచే కార్యాలయాలకు రాకపోకలు సాగిస్తున్నా... పట్టించుకోవడం లేదు. కనీసం మలుపుల వద్ద పొదలు తొలగించి సూచికలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పుల్కల్.



విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు

కారానా, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కంఠాపూర్ సెయింట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి పోటీలను సోమవారం బోయిన్‌పల్లి క్రీడ మైదానంలో జోడు సీతమ్మ మదుకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పోటీల్లో వికారాబాద్, మేడ్చల్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి సుమారు 699 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీ తెలిపారు.

కల్హేర్ ప్రత్యేకాధికారిగా అనిల్‌కుమార్

సిర్గాపూర్, కల్హేర్: కల్హేర్ మండల ప్రత్యేకాధికారిగా అనిల్‌కుమార్ నియమితులయ్యారు. సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించగా ఎంపీడీ శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంగ్రాం కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

విధుల్లో చేరిన డీపీవో వంశీధర్

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ సబ్ డివిజన్ కార్యాలయం డివిజన్ పరిపాలన అధికారిగా వంశీధర్ సోమవారం విధుల్లో చేరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేసిన వంశీధర్ తహసీల్దార్‌గా పదోన్నతిపై ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వచ్చారు.

ప్రగతి చక్రం పురస్కారాల ప్రదానం



జహీరాబాద్: పురస్కారాలు అందుకుంటున్న డ్రైవర్, కండక్టర్లు

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ డిపోలో ప్రమాదరహిత డ్రైవర్లు, అధిక ఆదాయం సాధించిన కండక్టర్లకు సోమవారం ప్రగతి చక్రం పురస్కారాలు పంపిణీ చేశారు. ఎస్ఐ కాశీనాథ్, డిపో మేనేజర్ జాకీర్‌హుస్సేన్, సహాయ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ వీటిని అందజేశారు.

ఆర్టీసీ బస్సు నిలపాలని వినతి

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: రాంసానిపల్లి కూడలి వద్ద ఆర్టీసీ బస్సులు నిలపాలని కోరుతూ సోమవారం భాజపా మండల అధ్యక్షుడు శివశంకర్ ఆధ్వర్యంలో సంగారెడ్డి, నారాయణఖేడ్ డిపో మేనేజర్లకు ఆ గ్రామస్థులు వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్టీసీ బస్సులతోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సులను రెక్వెస్ట్ స్టాప్‌లను ఏర్పాటు చేయాలని వారు కోరారు. జోగిపేట నుంచి బొమ్మారెడ్డిగూడెం వరకు ఒకే ఆర్టీసీ బస్సు సర్వీసును ఎప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని వారు విన్నవించారు.

ప్రచారం లేక ప్రజావాణికి అరకొర అర్జీలు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహణపై ప్రచారం కొరవడింది. అరకొర అర్జీలు వచ్చాయి. జహీరాబాద్‌లో తహసీల్దార్ రవీందర్ ప్రజావాణి నిర్వహించగా ఆరు అర్జీ మాత్రమే అందాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావలసిన ఎంపీడీవో సహా వివిధ శాఖల అధికారులు సరిగాలో హాజరు కాలేదు. మొగుడంపల్లిలో తహసీల్దార్ హసీనా బేగం ప్రజావాణి నిర్వహించగా ఒక్క అర్జీ కూడా రాకపోవడం విశేషం. ప్రజావాణి కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు వారాంతంలో ప్రచారం చేస్తే అత్యధిక మందికి ప్రయోజనం చేకూరుతుందని ప్రజలు కోరుతున్నారు.

'కంకర క్రషర్లకు అనుమతి ఇవ్వొద్దు'

జిన్నారం, న్యూస్‌టుడే: జిన్నారం మండలం మాదారం పరిధిలో కొత్త క్రషర్లకు అనుమతి ఇవ్వవద్దని సోమవారం సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు కలెక్టర్ క్రాంతిని కలిసి కోరారు. గ్రామానికి సమీపంలో ఇప్పటికే ఉన్న క్వారీల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రతిపాదించినట్లు సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కును విస్తరించి అందులో క్వారీ స్థలాన్ని కలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్‌గౌడ్, ఆంజనేయులు, మల్లేశ్, గణేశ్ పాల్గొన్నారు.

ఝరాసంగంలో పది సమస్యల పరిష్కారం

ఝరాసంగం, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో పది పరిష్కరించినట్లు ఎంపీడీవో సుధాకర్ తెలిపారు. ఝరాసంగం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. అర్జీలు 2వ పాలిసీ సంచులు వాడొద్దని విద్యార్థులకు అవగాహన నిర్వహిస్తామన్నారు.

తీపి గుర్తుగా మొక్కలు నాటుదాం: ఎంపీడీవో

గుమ్మడిదల, న్యూస్‌టుడే: తరచుగా బదిలీలపై వెళ్లే ఉద్యోగులు... పనిచేసిన ప్రాంతంలో గుర్తుండేలా ఒక మంచి పని చేయాలనే సంకల్పంతో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఎంపీడీవో ఉమాదేవి పుట్టినరోజు సందర్భంగా కార్యాదర్శుల సమక్షంలో కార్యాలయ ఆవరణలో ఆమె ఓ మొక్కను నాటారు. పంచాయతీ కార్యదర్శులు సైతం వారి ప్రాంతాల్లో ఇదేవిధంగా మొక్కలు నాటితే వాటి హరితహారానికి కొత్త ఊపుతోపాటు ఓ సంతృప్తి మిగులుతుందని ఆమె పేర్కొన్నారు.



కొనుగోలు కేంద్రాల్లో వసతులకు కృషి

సంగారెడ్డి మున్సిపాలిటీ: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పిస్తామని టీజీఎంఎస్ చైర్మన్ శివశంకర్ అన్నారు. టీజీఎంఎస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు లోబడి తేమ శాతం ఉండాలన్నారు. ధాన్యాన్ని రైతు మిల్లులకు తరలించేందుకు తగిన ప్రణాళిక ముందుగానే చేసుకోవాలని ఆ శాఖ అధికారులకు సూచించారు.

ఘాటు వాసనలు.. ప్రజల ఇక్కట్లు

జిన్నారం: గడ్డపోతారం, చెట్ల పోతారం, కిష్టాయపల్లిలో రెండు రోజులుగా ప్రజలు ఘాటు వాసనలతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పారిశ్రామిక వాడలోని కొన్ని పరిశ్రమలు విడుదల చేసే విష వాయువుల వల్ల ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ సమస్యను పీసీబీ అధికారులకు వివరించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యను ఇప్పటికైనా గుర్తించాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఎస్‌బీఐ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సెల్‌ఫోన్ రిపేరింగ్ ఉచిత శిక్షణ కోసం అర్హులైన పురుషులు ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

ప్రతిభకు బహుమతి

న్యాల్‌కల్: న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి) ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వినయ్‌రెడ్డి ఇటీవల సంగారెడ్డిలో నిర్వహించిన 'పోస్టర్ మేకింగ్' పోటీల్లో ద్వితీయ బహుమతి గెల్చుకున్నాడు. సోమవారం పాఠశాలలో హెచ్ఎం రాజ్‌కుమార్ ఆయనను అభినందించారు.

మాంసం విక్రయాలు నిషేధం

సదాశివపేట, న్యూస్‌టుడే: పట్టణంలో అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని మాంసం విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించిందని మున్సిపల్ కమిషనర్ ఉమ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఎవరైనా అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇన్‌స్పైర్‌పై అవగాహన

నారాయణఖేడ్: ఖేడ్‌లో సోమవారం ఇన్‌స్పైర్‌లో నామినేషన్ వేయని ఖేడ్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని మండలాల విద్యాధికారులతోపాటు రిసోర్స్‌పర్సన్ మన్నె జయపాల్ ఇన్‌స్పైర్ గురించి సమగ్రంగా వివరిస్తూ అవగాహన కల్పించారు.

రేపు రక్తదాన శిబిరం

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: ఖేడ్‌లోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహం పక్కనున్న మైదానంలో బుధవారం గాంధీ జయంతి, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కిష్టారెడ్డి జయంతులను పురస్కరించుకుని లయన్స్‌క్లబ్, పట్లోళ్ల కిష్టారెడ్డి(పీకేఆర్) ట్రస్టు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

న్యాల్‌కల్, న్యూస్‌టుడే: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన న్యాల్‌కల్ శివారులో సోమవారం చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక ఇస్సాపూర్‌ ఇబ్రాహీంపూర్‌ నుంచి తన ద్విచక్రవాహనంపై న్యాల్‌కల్ వైపునకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం న్యాల్‌కల్ శివారులో ఆయనను ఢీకొంది. ఆతడికి తీవ్ర గాయాలు కావడంతో బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాభివృద్ధికి కృషి



విద్యార్థులకు బూట్లు, టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈవో భీంసింగ్

ముస్తాపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు తమవంతు సహకారం అందించడం అభినందనీయమని ఎంఈవో భీంసింగ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దగోపులారం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులందరూ కలిసి సొంత ఖర్చులతో వారికి సోమవారం బూట్లు, టై, బెల్టులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు తుకారాం, భాస్కర్, నాగేశ్వరరావు, సురేందర్, మాజీ సర్పంచి కీర్తి కుమార్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ పాండు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థుల సత్తా



జాతీయంగా రాణించిన హత్నూర్ గురుకులం విద్యార్థులు

హత్నూర, న్యూస్‌టుడే: బీఎసీఎచ్‌ఎల్‌లో ఈ నెల 28న జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల్లో హత్నూర సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు సత్తాచాటారు. అండర్-14, 17 బాలుర ఖోఖో విభాగంలో క్రీడాకారులు జిల్లాలో మొదటి స్థానంలో నిలవగా, అండర్- 14 విభాగంలో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లాస్థాయి పోటీల్లో పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తేవడంతో ప్రిన్సిపల్ కేక్ మయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు శాంతికుమార్ క్రీడాకారులను అభినందించారు.

దీక్షకు తరలిన భాజపా నాయకులు

గుమ్మడిదల: భాజపా ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్ చేపట్టిన దీక్షకు గుమ్మడిదల మండలం పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు తరలివెళ్లారు.

రైతులకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే

జిన్నారం: రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఐడీఏ జిన్నారం మండలం ఊట్ల, లక్ష్మీపతిగూడెం చెందిన ముగ్గురు రైతులకు చెందిన రైతు బీమా రూ.5 లక్షల చొప్పున చెక్కులను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు కె.ప్రభాకర్, మాజీ సర్పంచి ఆంజనేయులు, లావణ్య, ట్రాన్స్‌కో ఏఈ రాజు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మహిపాల్‌రెడ్డి

అంకిత భావంతో పని చేయాలి

రాయికోడ్: అంకిత భావంతో పనిచేసి విద్యార్థుల మనస్సుల్లో చెరగని ముద్ర వేయాలని ఎంఈవో అంజయ్య అన్నారు. సోమవారం ఎంఆర్సీలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులతో ఆయన సమీక్షించారు. ఇటీవల అనంతరం బదిలీపై వెళ్లిన ఎంఈవో శ్రీనివాస్, ప్రభుత్వ ఉద్యోగం పొందిన సీఆర్పీలు జనార్దన్, శశికళకు సన్మానం చేశారు.